ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 15 నవంబరు 2024 | 5





లైఫియస్ ఫార్మా ఫ్యాక్టరీ గేటు ఎదురుగా బైఠాయించిన రైతులు, మత్స్యకారులు

పూర్వ వైభవం దిశగా..

కాకినాడ శిల్పారామానికి మళ్లీ మంచి రోజులు..

- గత ప్రభుత్వ నిర్వాకంతో గాడితప్పిన శిల్పారామానికి పూర్వవైభవం
- ఇకపై రాత్రివేళల్లోనూ పర్యాటకుల కోసం తెరిచి ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు
- ప్రతివారం సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు
- రూ.3కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులో మరిన్ని హంగులు
- ఈనెల 26న ఇక్కడకు వచ్చి తనిఖీ చేయనున్న పర్యాటకశాఖ ఉన్నతాధికారులు
- పర్యాటకులకు మరింతగా మెప్పించేలా తీర్చిదిద్దేందుకు సన్నాహాలు





● (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ శిల్పారామానికి మళ్లీ మంచిరోజులు రాబోతున్నాయి. అయిదెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ శిల్పారామం గత వైసీపీ అయిదేళ్ల పాలనలో గాడితప్పింది. పర్యాటకులను మెప్పించలేక ఈసురోమని కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తిరిగి దీనికి పూర్వవైభవం తేవాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో త్వరలో సంస్కరణలు తీసుకురాబోతోంది. అందులోభాగంగా రాత్రివేళ సైతం శిల్పారామం తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతివారం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించాలని ఆదేశించింది. ప్రస్తుతం అనేక సదుపాయాలు, అద్భుతమైన పచ్చదనం ఉన్నా దీనికి పర్యాటకులు రాకపోవడంపై త్వరలో ఇక్కడ తనిఖీలు చేయబోతోంది. ఈనెల 26న అమరావతి నుంచి శిల్పారామం విభాగం అధికారులు పరిశీలనలు జరిపి పర్యాటకులు పెరగడానికి ఏంచేయాలనేదానిపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం..

కాకినాడ నగర శివార్లలోని వాకలపూడి సమీపంలో శిల్పారామం ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయిదెకరాల విస్తీర్ణంలో రూ.3కోట్లతో దీన్ని నిర్మించారు. ఇది నగరానికి దూరంగా ఉండడం, సమీపంలో అనేక పరిశ్రమలు ఉండడంతో పర్యాటకులు పెద్దగా శిల్పారామానికి వచ్చేవారు కాదు. అటు మహిళలకు సైతం ఇది సురక్షితంగా లేకపోవడంతో శిల్పారామం ఆదరణకు నోచుకోలేదు. దీంతో భారీగా ఖర్చుచేసి లోపల బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. దీంతో క్రమేపీ పర్యాటకులు పెరిగారు. శిల్పారామం ఉన్న రహదారిలో ప్రయాణ సదుపాయం పెద్దగా లేకపోవడం లోటుగా మారింది. వ్యక్తిగత వాహ నాలు ఉన్నవారు మినహా మిగిలినవారికి వెళ్లడానికి అనేక ఇబ్బందులు. ఏదోలా వారాంతాల్లో పర్యటకులు వస్తూపోతూ ఉండేవారు. గడచిన వైసీపీ అయిదేళ్ల పాలనలో శిల్పారామం నిర్వహణ దారుణంగా మారింది. బయట, లోపల పరిశుభ్రత కోల్పోయింది. లోపల గతంలో సుందరంగా తయారు చేసిన పచ్చిక బయళ్లు, చిన్న గదులు పూర్తిగా రూపురేఖలు కోల్పోయాయి. అటు ప్రభుత్వం కూడా దీనిని పక్కనపడేసింది. ఫలితంగా పూర్తిగా పర్యాటకులు దీనికి దూరమయ్యారు. అంధవికారంగా, పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో ఎవరూ రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ లేక దారుణంగా తయారైన శిల్పారామాలకు తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని నిర్ణయించింది. దీంతో కాకినాడ శిల్పారామంపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆరు అయితే మూతబడుతున్న శిల్పారామాన్ని ఇకపై రాత్రివేళల్లో కూడా తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీచేశారు. కళ్లుమిరిమిట్లు గొలిపేలా విద్యుత్‌కాంతులు సిద్ధం చేయాలని సూచించారు.

నూతన హంగులు

ప్రస్తుతం ఏ వినోద కార్యక్రమాలు కూడా జరగకపోవడంతో పర్యాటకులు రావడం లేదని గుర్తించారు. దీంతో త్వరలో వారంలో రెండురోజులు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి, డ్యాన్సులు కూడా నిర్వహించనున్నారు. ఇందుకోసం నగరంలో పలు ప్రభుత్వ ప్రైవేటు స్కూలు, కాలేజీలతో శిల్పారామం ఒప్పందం కుదుర్చుకుని వీటిని ప్రోత్సహించబోతోంది. అందుకోసం శిల్పారామంలోని వసతులు సమకూర్చనుంది. ప్రస్తుతం అధ్వానంగా ఉన్న దీన్ని మరింత అందంగా తీర్చిదిద్ది, సంస్కృతిక, సంప్రయదాలు మరింత ఉట్టిపడేలా కొత్త హంగులు అద్దనున్నారు. దీనికి రావాలంటే రవాణా సదుపాయాలు కూడా పెద్దగా లేనందున ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఈ రూట్‌లో వస్తే ఆదరణ పెరుగుతుందనే కోణంలో త్వరలో పరిష్కారం చూపనున్నారు. శిల్పారామంలో జరిగే కార్యక్రమాలపైనా విస్తృత ప్రచారం చేసి పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్వహణలో మార్పులు చేయనున్నారు. ఇందుకోసం వీటన్నింటినీ పరిశీలించడానికి ఈనెల 26న శిల్పారామం సీఈవో రానున్నారు. తన బృందంతో ఇక్కడ పర్యటించి లోపాలు, మరిన్ని వసతులు ఏమేం సమకూర్చాలి? అనేదానిపై పరిశీలించి కొత్తరూపు తీసుకురానున్నారు.

'అరబిందో'పై ఆగ్రహం



తొండంగిలో లైఫియస్ ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన చేస్తున్నరైతులు

మెయిన్‌లో..

- తొండంగిలో లైఫియస్ ఫ్యాక్టరీ గేటు ముందు రైతుల బైఠాయింపు
- స్థానికులను కాదని స్థానికేతరులకు ఉద్యోగ కల్పనపై అభ్యంతరం
- హామీలు నెరవేర్చాలని డిమాండ్
- స్తంభించిన రాకపోకలు
- యాజమాన్యం, రైతులతో సమావేశానికి కలెక్టర్ హామీ

పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంఘం
మొదటి విడత నిధులు విడుదల

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు మంచి రోజులొచ్చాయి. కూటమి ప్రభుత్వం మూడు నెలలు వ్యవధిలో 2024-25గాను 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. 2023-24గాను కాకినాడ జిల్లాకు రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు మార్చిలో విడుదల కావాల్సిన ఉండగా ఆగస్టులో రూ.27.02కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం వాటికి వడ్డీ కింద సెప్టెంబరులో జేసిక్ నిధులు రూ.33.10లక్షలు, టైడ్ నిధులు రూ.43.15 లక్షలు, వడ్డీ ఆయా పంచాయతీలకు కూటమి ప్రభుత్వం జమచేసింది. 2024-25గాను 15వ ఆర్థిక సంఘం మొదటి విడతగా రూ.28.38కోట్లు నిధులను గురువారం ప్రభుత్వం విడుదల చేసింది. గత ప్రభుత్వంలో మాదిరి నిధుల్లో నుంచి విద్యుత్‌చార్జీల బకాయిల పేరుతో కోతలు, ఇతర అవసరాలకు మళ్లింపు వంటి వాటికి ఆస్కారం

కాకినాడ జిల్లాకు రూ.29.38కోట్లు

లేకుండా కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం మొదటి విడత జేసిక్ నిధులు రూ.11కోట్ల35లక్షల34వేల971, టైడ్ నిధులు మొదటి విడత రూ.17కోట్ల3లక్షల2వేల452 నిధులను విడుదల చేస్తున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో మూడు నెలల వ్యవధిలో భారీ పంచాయతీలకు నిధులు విడుదల కావడంతో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నిధులు ఉపయోగపడతాయన్న సర్పంచ్‌లు, కార్యదర్శులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పౌర్ణమితో ఉప్పొంగుతున్న సముద్రం



ఉప్పాడ రేవులో కెరటాల ఉధృతి

కొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావానికి నేడు కార్తీకపౌర్ణమి కావడంతో తీరంలో సముద్రం ఉప్పొంగుతోంది. గురువారం మధ్యాహ్నం నుంచి సముద్రం లోపల కెరటాలు అడ్డదిడ్డంగా, తారాస్థాయిలో లేస్తూ బీచ్‌రోడ్డుకు పైకి దూసుకొస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా కొత్తపల్లి పోలీసులు సాయంత్రం నుంచి ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డులో వాహ నాల రాకపోకలను నియత్రించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



హాజరైన వివిధ శాఖల అధికారులు

- హాజరైన కలెక్టర్, ఎస్పీ
- ట్రామాకేర్, సీపీఆర్, అత్యవసర వైద్యచికిత్సలపై అవగాహన

కాకినాడ క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ద్వారా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాలు లేదా మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో బాధిత కుటుంబాలు రోడ్డునపడి బతుకులు ఛిద్రమవుతున్నాయి. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సూచనలతో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సుల్లో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు కాకినాడ పోలీస్ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ షాన్‌మోహన్, అతిథులుగా వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ట్రామాకేర్, ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్, సీపీఆర్ ప్రథమ చికిత్స తదితర అత్యవసర వైద్యచికిత్సలపై కాకినాడ సాయిసుధా, అపోలో హాస్పటల్స్ వైద్యులు జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ఈ అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. వైద్యనిపుణులు ప్రయోగాత్మకంగా చేసి చూపించిన వైద్యచికిత్సలను రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయంలోఉన్న క్షతగాత్రులకు పోలీసులు, సిబ్బంది, ఇక్కడ నేర్చుకున్న అత్యవసర వైద్య చికిత్సను సంఘటనా స్థలాల్లో ఉపయోగిస్తే ఒక ప్రాణాన్ని కాపాడినవారవుతానన్నారు. రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాపాయంలో ఉన్న క్షతగాత్రుడికి సంఘటనా స్థలిలో ఏమేం చేయకూడదో, ఏమేం చేయాలో వైద్యులు వివరించారన్నారు. ముఖ్యంగా గోల్డెన్ హవర్ ప్రాముఖ్యత, సీపీఆర్ చేసే విధానం, ప్రథమ చికిత్స అందజేసే విధానాలపై స్పష్టంగా వివరించారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, అపోలో ఆస్పత్రి ఏవో రమణా, రవాణాశాఖ అధికారిని సబిత, సాయిసుధా హాస్పటల్ ఎండీ డాక్టర్ వాడ్రేవ్ రవి, అపోలో హాస్పటల్ వైద్యులు డాక్టర్ రవికిరణ్, డాక్టర్ అంజలి జిల్లావ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ ఐడీ వివరాలు నిక్షిప్తం చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యూడైస్ ప్లస్‌లో ప్రతి విద్యార్థి అపార్ ఐడీ, వివరాలను నిక్షిప్తం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలలో విద్యార్థుల అపార్ ఐడీని నమోదులో జాప్యం జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు శనివారంలోగా అందరూ విద్యార్థుల అపార్ ఐడీ 100శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 3,41,394మంది విద్యార్థులకు 2,35,567మందికి మాత్రమే అపార్ ఐడీలు క్రియేట్ చేశారన్నారు. విద్యార్థుల సమగ్ర వివరాలకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

సాంకేతిక రంగంలో భారత్ ముందు: జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్

జేఎన్టీయూకే, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్ ముందుందని ప్రపంచ స్థాయి కంపెనీల్లో భారతీయ ఇంజనీర్లకు మంచి డిమాండ్ ఉందని జేఎన్టీయూకే రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అన్నారు. వర్సిటీలోని యూసీఈకే ప్రిన్సిపాల్ సెమినార్ హాల్లో ఐఐఐపీటీ డైరెక్టరేట్, కోయంబత్తూరులోని జీకర్స్ ఎంప్లాయిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రోబోటిక్ అప్లికేషన్‌లకోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడం అనే అంశంపై మూడు రోజులపాటు విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. శిక్షణకార్యక్రమానికి ఐఐఐపీటీ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, గౌరవఅతిథిగా మాజీ వీసీ శ్రీనివాస్‌కుమార్ పాల్గొనగా రీసోర్స్ పర్సన్‌లుగా రాజా, భువనేశ్వరి హాజరయ్యారు. శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ఇండస్ట్రీ 4.0ను దృష్టిలో ఉంచుకుని ఎంటెక్ రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులను ప్రారంభించాలని వర్సిటీ అధికారులకు సూచించారు. రోబోటిక్ అప్లికేషన్‌లను అభివృద్ధి చేయడం, ఎంబెడెడ్ బోర్డుల రూపకల్పన తదితర సాంకేతిక పద్ధతులను విద్యార్థులకు ప్రాక్టికల్ విధానంలో రీసోర్స్ పర్సన్‌లు అవగాహన కల్పించారు.

అభ్యసన అనేది నిరంతర ప్రక్రియ అని జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని ఐఎస్టీ సెమినార్ హాల్లో ఎఫ్‌డీసీ, ఐఎస్టీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉన్నత విద్యాసంస్థల్లో అధ్యాపకులు బోధనలో రాణించేఅంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు.వీసీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితకాలపు విద్యార్థేనన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా ఎన్ఎంకే భట్టా హాజరయ్యారు.

సత్యదేవుడి గిరిప్రదక్షిణకు సర్వం సిద్ధం



భక్తులకోసం ఏర్పాటు చేస్తున్న స్టాల్స్

- రెండు భాగాలుగా గిరియాత్ర
- నేడు ఉదయం 8గంటలకు పల్లకిలో సత్యదేవుడు
- మధ్యాహ్నం 2గంటలకు సత్యరథంతో నూతనంగా..

మెయిన్‌లో..

పంచాయతీ కార్యదర్శులకు ఏవో క్షమాపణ

- ఏవోపై డీపీవో ఆగ్రహం
- సెలవుపై వెళ్లాలని ఆదేశాలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఏవో జె.వెంకటరెడ్డి పంచాయతీ కార్యదర్శులపై అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో రికార్డింగ్ బయటపడడంతో వారంతా డీపీవో రవికుమార్‌కి గురువారం ఫిర్యాదు చేయడంతో కార్యదర్శుల సమక్షంలో ఏవో వెంకటరెడ్డిని పిలిపించి క్షమాపణ చెప్పించారు. అనంతరం ఏవోపై ఆగ్రహం వ్యక్తం చేసి సెలవుపై వెళ్లాలని సూచించారు. ఇకనైనా బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన



క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి తద్వారా మెరుగైన వైద్య చికిత్స అందించి ఆ మహమ్మారిని సమూలంగా నాశనం చేసే దిశగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ 3.0 సర్వే కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌ను యూపీహెచ్‌సీ ప్రకాశం స్ట్రీట్ పోస్టల్ నగర్ కాకినాడలో ఈ యాప్ ప్రారంభించామన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, వార్డు, గ్రామ సచివాలయం ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించి అనుమానిత లక్షణాలు ఉన్నవారికి స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నావళి ద్వారా క్యాన్సర్, మధుమేహం పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన వివరాలను సంబంధిత యాప్‌లో పొందుపరుస్తామన్నారు. అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా రొమ్ము, నోటి, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు మహిళా ఆరోగ్య సిబ్బంది ఇంటివద్దకే వచ్చి చేస్తారని వీటితోపాటు మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేస్తారని జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో కోరారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే, పీవో డాక్టర్ ప్రభాకర్, డీపీఎంవో డాక్టర్ సురేఖ, వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

పఠనాసక్తితో జ్ఞానసముపార్జన

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్నతనంనుంచే పఠనాసక్తి పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో అవసరమయ్యే జ్ఞాన సముపార్జనకు సరైనా పునాది వేసుకోవచ్చునని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం కాకినాడ మెయిన్‌రోడ్డులో ఉన్న జిల్లా గ్రంథాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పుస్తకపఠనం అనేది చాలా మంచి అలవాటన్నారు. చిన్నతనం నుంచే పఠనాసక్తి పెంచుకోవాలన్నారు. రోజు చదివే పాఠ్యపుస్తకాలతోపాటు లోకజ్ఞానం, విజ్ఞానాన్ని కలిగించే పుస్తకాలు చదవడంపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. రోజూ పుస్తక పఠనం చేయడం ద్వారా భవిష్యత్‌కు అవసరమయ్యే జ్ఞానసముపార్జన సరైన పునాది వేసుకునేందుకు మంచి అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా ఒకవస్తువు తయారీ విధానం గురించిగాని, గతంలో జరిగిన సామాజిక, చారిత్రక విశేషాలు గురించిగానీ, ఎవరైనా గొప్ప వ్యక్తి గురించి పుస్తకం రాసి ఉంటే అది కచ్చితంగా గ్రంథాలయంలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఉపవిద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి ఉప గ్రంథాలయ అధికారి కిషోర్, సిబ్బంది రవికుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

నాలుగో రోజు ఎమ్మెల్సీ నామినేషన్లు నిల్

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నాలుగోరోజు గురువారం నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో కలెక్టరేట్‌లో కోర్టుహాలు ఖాళీగా దర్శనమిచ్చింది. ఈనెల 11వతేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటివరకు కేవలం రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు అయ్యాయి. ఈనెల 18వతేదీతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుంది.



మన రాష్ట్రంలో దర్శనీయ ప్రాంతాలుగా ఉన్న పంచారామ క్షేత్రాల గురించి శ్రీనాథుడు రచించిన భీమేశ్వర పురాణంలో ఉన్నట్లు పండితులు చెపుతున్నారు. క్షీరసాగర మధనం సమయంలో వెలువడిన అమృతాన్ని మహావిష్ణువు మోహిని రూపం ధరించి సురాసురులకు పంచుతుండగా తమకు అన్యాయం జరిగిందంటూ రాక్షసులు అసంతృప్తి చెందారు. వారు శివుడి కోసం తీవ్ర తపస్సు చేస్తారు. తారకాసురుడు అనే రాక్షసుడు మహా తపస్సు చేసి తనకు స్త్రీ గర్భం నుంచి పుట్టిన ఎవరి వల్లా మరణం రాకూడదని పరమశివుని వరం పొందుతాడు. శివుడు తన ఆత్మలింగాన్ని ప్రసాదించి వరం అనుగ్రహిస్తాడు. తారకాసురుడు ఆ వర గర్వంతో దేవతలను హింసించడంతో వారంతా మహాదేవుని వేడుకుంటారు. స్త్రీగర్భం నుంచి పుట్టని వారు ఎవరా అలోచింపగా కుమారస్వామిని గుర్తించి పరమశివుని ఆదేశానుసారం దేవతల సైన్యానికి అధిపతిగా నియమిస్తారు. కుమారస్వామి తారకాసురుడితో భీకరయుద్ధం చేసి తన పాశుపతంతో వధిస్తాడు. తారకాసురుని మెడలో ఆత్మలింగం ఐదు ఖండాలుగా అవుతుంది. ఈ ఐదు ఖండములు ఐదు క్షేత్రాలలో ప్రతిష్ఠించబడ్డాయి. అందులో ఒకటి అమరావతిలో ఇంద్రుడు ప్రతిష్ఠించగా, రెండో శకలం చంద్రునితో భీమవరంలో, మూడో శకలం శ్రీరామచంద్రుడు పాలకొల్లులో, నాల్గో శకలం కుమారస్వామి సామర్లకోటలో ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఐదో శకలం ద్రాక్షారామంలో ప్రతిష్ఠించేందుకు సప్త మహా రుషులు సంకల్పించగా అనుకున్న ముహూర్తానికి కాలయాపన జరగడంతో భీమేశ్వరుడు స్వయంభువుగా వెలసినట్లు పురాణాలు చెప్తున్నాయి. అవే పంచారామ క్షేత్రాలుగా విలసిల్లుతున్నాయి. నేడు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ పంచారామ క్షేత్రాలు.. వాటి విశిష్టతపై ప్రత్యేక కథనం..

సామర్లకోట/ద్రాక్షారామ



ఓం నమో.. శివ రుద్రాయ..

» కార్తీకమాసంలో దర్శనీయ క్షేత్రాలుగా పంచారామాలు » ఐదు ఆలయాలకు ఎంతో విశిష్టత » నేడు కార్తీక పౌర్ణమి

వర్ణాలు మారే గునుపూడి సోమేశ్వరుడు



చరిత్ర ప్రసిద్ధికెక్కిన అతి ప్రాచీన దేవాలయాల్లో గునుపూడి శ్రీసోమేశ్వర జనార్ధనస్వామి దేవాలయం ఒకటి. తూర్పు చాళుక్య రాజుల్లో ప్రసిద్ధుడైన చాళుక్యభీముడు ఈ దేవాలయాన్ని మూడో శతాబ్ధంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. స్థలం పురాణంలో ఈ క్షేత్రాన్ని పరమ పవిత్రక్షేత్రంగా వర్ణించారు. ఈ దేవాలయం గురించి భీమఖండం, బ్రహ్మాండ పురాణంలోను పేర్కొన్నారు. చంద్రుడే స్వయంగా ప్రతిష్ఠంచడం వల్ల ఇక్కడి శివలింగం అమావాస్య రోజున గోధుమవర్ణంలోను, పౌర్ణమినాడు శ్వేతవర్ణంలో కనిపిస్తుంది. శివలింగ పైభాగమున అన్నపూర్ణ అమ్మవారి విగ్రహం ఉండడం మరో ప్రత్యేకత. ఈశ్వరుడు గంగను శిరస్సుపై ధరించడానికి ప్రతీకగా ఈ విధంగా నిర్మితమైనదని ప్రజల నమ్మకం. ఈ దేవాలయానికి జనార్ధనస్వామి క్షేత్రపాలకుడు అవడంతో ఇక్కడ వివాహం చేసుకుంటే వైవాహిక జీవితం ఎంతో శుభమయంగా సాగుతుందని నమ్మకం.

యోగ లింగం.. కుమారరామం



సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వరాలయం రాష్ట్రంలో ఏకైక యోగలింగంగా, జప, తప, యోగ సాధన చేసే వారికి ప్రశాంతమైన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. చాణక్య వంశానికి చెందిన భీమమహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, ద్రాక్షరామ భీమేశ్వరాలయం ఈ రెండు ప్రాకారాలు వాస్తురీత్యా ఒకే ఆకారం కలిగి ఉంటాయి. నాలుగు దిక్కుల్లో నాలుగు గోపుర ద్వారాలు, లోపలి ప్రాకారం సమతలంగాను రెండు భాగాలు చేశారు. గుడి చుట్టూ రెండంతస్తులు మండపం ఉంది. ఈ మండపం ఎక్కేందుకు తూర్పుభాగాన మెట్లు, లోపలి మండపం నుంచి కిందికి దిగేందుకు దక్షిణం వైపున విఘ్నేశ్వరుని ఆలయం, సూర్యుని గుడి, తూర్పు వైపున గిరిజా సుందరి ఆలయం ఉన్నవి. లోపలి ప్రాకారం మధ్యలో ఉన్న భీమేశ్వరుని ఆలయం చతురస్రాకారంగా ఉండి రెండు అంతస్తులు కలిగి ఉన్నది. కింది అంతస్తులో ప్రతిష్ఠించిన లింగం పైఅంతస్తు కప్పు గుండాపోయి రెండో అంతస్తులోకి ప్రవేశించి రుద్రభాగం పూజింపబడుతోంది.





ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం ద్రాక్షారామం..



పంచారామాలలో ప్రసిద్ధి గాంచిన ఆరామంగా, త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా, ద్వాదశ జ్యోతిర్లాంగాలలో ప్రముఖ క్షేత్రంగా విరాజిల్లుతున్న ప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామం. ఈ క్షేత్రంలో స్వయంభువుడుగా భీమేశ్వర స్వామి, అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తిపీఠంగా మాణిక్యాంబ అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. ద్రాక్షారామ క్షేత్ర మహాత్యం గురించి వ్యాసుడు తన భీమఖండంలో దక్షారామత్వరం నభూతో నభవిష్యతిగా స్తుతించాడు. కవి సార్వభౌముడు శ్రీనాధుడు ద్రాక్షారామ వంటి క్షేత్రం, భీమేశ్వరుని వంటి దైవం, సప్తగోదావరి వంటి తీర్ధరాజం ఇలలోలేదని పేర్కొన్నాడు. భీమేశ్వరుని ఆలయం క్రీశ 892-922 కాలంలో నిర్మాణం ప్రారంభించినట్లు ఆలయంలో ఉన్న శిలాశాసనాల ద్వారా తెలుస్తున్నది. చాళుక్యరాజు మొదటి భీమునికాలంలో నిర్మాణం జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. కార్తీకమాసంలో సప్తగోదావరిలో పుణ్యస్నానమాచరించి భీమేశ్వరుని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. భీమేశ్వరునికి సూర్యభగవానుడు తొలి అర్చన చేసినట్లు చెబుతారు.

దేవేంద్రుడు ప్రతిష్ఠించిన అమరేశ్వరస్వామి





అమరావతిలో శివలింగాన్ని దేవతల రాజైన ఇంద్రుడు ప్రతిష్ఠించాడని స్థలపురాణం. తారకాసురుని మెడలోని కుమారస్వామి ఛేదించిన ఆత్మలింగం ఐదు ముక్కలుగా పగిలి ఐదు క్షేత్రాలలో పడింది. అందులో అమరావతిలో పడిన భాగాన్ని దేవతలకు అధి పతి అయిన దేవేంద్రుడు ప్రతిష్ఠించినట్టు స్థల పురాణంలో ఉంది. ఇక్కడ శివలింగం అత్యంత ఎత్తుగా ఉండడంతో అర్చకులు పీఠం ఎక్కి అభిషేకాలు చేస్తుంటారు. ఎత్తు పెరగకుండా ఉండేందుకు బృహస్పతి ఆదేశాల మేరకు మేకు కొట్టడంతో శివలింగం పైభాగంలో రక్తం మరక ఏర్పడినట్టుగా చెబుతారు. ఇప్పటికీ ఆ మరక కనిపిస్తుంది. ఈ శివలింగాన్ని శ్రీరామ చంద్రుడు పూజించాడని చెప్తారు. అమరుల నివాసంగా మారిన ప్రాంతంగా అమరావతి అనే పేరు వచ్చిందని పురణాకథనం. బాలచాముండికా సమేతుడైన అమరేశ్వరస్వామి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు.

దర్శనీయ క్షేత్రాలు

కార్తీకమాసంలో జిల్లాలో పలు ఆలయాలు భక్తులతో కళకళలాడతాయి. వీటిలో ముఖ్యమైనవి.

● అన్నవరం సత్యదేవుడి పుణ్యక్షేత్రం



రత్నగిరి కొండపై హరిహరహిరణ్యాగర్భ త్రిమూర్త్యాత్మక స్వరూపుడిగా అనంతలక్ష్మీ సత్యదేవితో కలిసి శ్రీ సత్యదేవుడు వెలిశాడు. కరనామ సంవత్సర శ్రావణ శుద్ధ విధియనాడు స్వామి అన్నవరం గ్రామంలో పంపానది తీరాన రత్నగిరిపై అంకుడి చె ట్టుకింద దర్శనమిస్తారని చెబుతారు. 125ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం ఖరనామ సంవత్సర శ్రావణ శుద్ధ విధియ 1891, ఆగస్టు 6న నిర్మించారు.

● అంతర్వేది లక్ష్మీనరసింహుడి ఆలయం

దక్షిణ భారతదేశాన్ని పాలించిన పల్లవరాజులు క్రీస్తుశకం 5వ శతాబ్దంలో అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించారు. నౌక వ్యాపారి కొప్పనాతి ఆదినారాయణ దీన్ని పునర్నిర్మించారు.

● అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరుడు

గౌతమీ గోదావరి నదీతీరాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో శ్రీ విఘ్నేశ్వరుడు దక్షిణాభిముఖుడై ఉన్నాడు.ఆలయం లో దక్షిణ సింహద్వారం గుండా శ్రీవిఘ్నేశ్వరుడిని, తూర్పు సింహద్వారంనుంచి క్షేత్ర ప్రభువును దర్శించవచ్చు.

● పిఠాపురం పాదగయ...


ఒకప్పుడు పీఠికాపురం.. పిఠాపురంగా ప్రసిద్ధి చెందింది. శివకేశవ పుణ్యక్షేత్రంగా భక్తులుదర్శించుకుంటున్నారు. దేశంలోని త్రిగయాలలో ఒకటిగా పిఠాపురం పాదగయ క్షేత్రంగా విరాజిల్లుతోంది.

● చినవెంకన్నగా ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల వేంకటేశ్వరుడు భక్తులకు కొంగు బంగారమై వెలసిల్లాడు. శని, ఆదివారాల్లో రద్దీగా ఉంటుంది.

విష్ణుమూర్తి ప్రతిష్ఠించిన క్షీరారాముడు..



క్షీరపురి (పాలకొల్లు)లో పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి కొలువుతీరి ఉన్నారు. స్కాంధ పురాణ ఆధారంగా ఆలయ చరిత్ర గురించి తెలుస్తోంది. తారకాసురుడిని వధించడానికి శివుని కుమారుడు కుమారస్వామి భీకర యుద్ధం చేసి తారాకాసురుడి దేహంలో ఉన్న అమృతలింగం ఖండించాడు. అందులో శిరోభాగం క్షీరపురి క్షేత్రంలో పడడంతో శ్రీమహావిష్ణువు ఆ ఖండభాగాన్ని ప్రతిష్ఠించినట్టు తెలుస్తోంది. 918 ప్రాంతంలో మొదటి చాణిక్య భీముడు ఇక్కడ ఆలయనిర్మాణం చేపట్టినట్టు చరిత్ర ఆధారంగా తెలుస్తోంది. అనంతరం శాతవాహనులు, ఇక్ష్వాకులు, తూర్పు చాణుక్యుల పాలనలో ఆలయం అభివృద్ధి చెందింది. దీంతోపాటు 120 అడుగుల ఎత్తున 9 అంతస్తుల్లో గాలిగోపురం నిర్మించి పైభాగంలో శిఖరాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో పంచగణపతులు, శివ పంచాయతన దేవాలయం, పంచ లింగాలు, పంచదేవేర్లు, పంచ మండపాలు, పంచ ద్వారాలు, పంచ నందులు, పంచ శిఖరాలు ఉండడం విశేషం. ఇక్కడి శివలింగం తెల్లని పాల రంగులో ఉంటుంది. క్షీరారామంలో ఓరోజు బస చేస్తే ఒక ఏడాది ఉన్నట్లేనని నమ్మకం.



ఒకే రోజులో పంచారామాల యాత్ర

» ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
» ఐదు క్షేత్రాలు సందర్శించేలా రూట్
» వారాంతాల్లో వెళ్లి రావొచ్చు

కాకినాడ నుంచి ఇలా...

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 14: కార్తీక మాసంలో ప్రత్యేక దర్శనాల కోసం ఆర్టీసీ పంచారామల టూర్ ప్యాకేజీని రూపొందించింది. ఒకేరోజులో ఈ ఐదు ఆలయాలను వెళ్లి వచ్చేలా ఆర్టీసీ స్పెషల్ ప్యాకేజీని అందుబాటులో ఉంచింది. కాకినాడ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుంది. ముందుగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, చివరిగా సామర్లకోట దర్శనం జరుగుతుంది. అనంతరం ప్రయాణికులతో బస్సు మరుసటిరోజు రాత్రికి కాకినాడ డిపోకు చేరుతుంది. కార్తీకమాసంలో ప్రతి శని, ఆదివారాల్లో అనగా నవంబరు 16, 17, 23, 24, 30, డిసెంబరు 1 తేదీల్లో బస్సు పంచారామ క్షేత్రాలకు బస్సు రాత్రి 8 గంటలకు బయలు దేరుతుంది. కాకినాడనుంచి పంచారామ టూర్ టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ రూ.910, అల్ట్రా డీలక్స్‌కు రూ.1120, సూపర్ లగ్జరీకి రూ.1160గా ఉన్నాయి.

పర్యటన ఇలా..

కాకినాడనుంచి నేరుగా పంచారామాల్లో ఒకటమైన అమరావతికి ముందు వెళ్తారు. అక్కడి అమరలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుని అక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి వెళ్తారు. అక్కడ సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం పాలకొల్లు బయలుదేరి వెళ్లి అక్కడి క్షీరరామ లింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు. తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామానికి బయలుదేరతారు. అక్కడ భీమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అక్కడి నుంచి చివరిగా కాకినాడ జిల్లా సామర్లకోటలోని కుమారభీమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత బస్సు కాకినాడ డిపోకి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్యాకేజీలో భాగంగా కేవలం బస్సు ప్రయాణం మాత్రమే ఉంటుంది. ఆహారం, అక్కడి ఎంట్రీ టికెట్లు వంటివి యాత్రికులే చూసుకోవాలి.

టికెట్ బుకింగ్ ఇలా..

ప్రత్యేక బస్సులకు టికెట్‌లను కాకినాడ బస్ డిపోలో, ఆన్‌లైన్‌లో, ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద ముందుగా పొందవచ్చు. భక్తులు బస్సు సరిపడా ఉండి కోరితే కావాల్సిన ప్రదేశానికి బస్సులు నేరుగా కూడా పంపుతారు. అద్దె ప్రాతిపదికన కూడా మొత్తం బస్సును బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఆయా బస్సుల రిజర్వేషన్ కోసం 9959225564, విచారణ కోసం 9959225543 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.



అమలాపురంలో పంచారామ క్షేత్రాల దర్శనం కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు

అమలాపురం నుంచి ఇలా వెళ్లొచ్చు

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రాలను ఒకే రోజున దర్శించుకునే వీలుగా ప్రత్యేక బస్సులను అమలాపురం నుంచి కూడా ఏర్పాటు చేశారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలను దర్శించవచ్చు. ప్రతీ ఆదివారం రాత్రి 7 గంటలకు అమలాపురం నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. కార్తీకమాసంలో ఈనెల 17, 24 తేదీల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, వ్యాపారుల కోరిక మేరకు ఈనెలలో ప్రతి శనివారం రాత్రి 7గంటలకు బస్సులు బయలుదేరి ఆదివారం సెలవు రోజు కావడం వల్ల పంచారామాలను దర్శించుకునే విధంగా ఈనెల 16, 23 తేదీల్లో కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అమలాపురం నుంచి పెద్దలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రూ.950, ఆల్ట్రా డీలక్స్‌కు రూ.1170, సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.1220, పిల్లలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రూ.720, ఆల్ట్రాడీలక్స్‌కు రూ.880, సూపర్ లగ్జరీకి రూ.920 టిక్కెట్ ధర నిర్ణయించారు.

అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం

కార్తీకమాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులకు అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం ఉందని డిపో మేనేజర్ సీహెచ్‌ఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. యాత్రలకు వెళ్లేవారు అసిస్టెంట్ మేనేజర్ సెల్ 7013868687ను సంప్రదించవచ్చు. అడ్వాన్స్ రిజర్వేషన్‌కోసం 9959225576, 7382909620 నెంబర్లలోను సంప్రదించవచ్చు.

ఏకాదశ రుద్రుల దర్శనయాత్ర

అంబాజీపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో ఏకాదశ రుద్రుల శైవక్షేత్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో భక్తులు వేలసంఖ్యలో తరలివస్తున్నారు. 450 శతాబ్దాల చరిత్ర కలిగిన జగన్నతోట ప్రభల ఉత్సవానికి 2020లో ప్రధాని మోదీ ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలంటూ అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశయూత్ సభ్యులకు లేఖను రాశారు. శృంగేరీ పీఠాధిపతి ఏకాదశ రుద్రులపై లేఖను అందించారు. ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన 74వ రిపబ్లిక్ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకాదశ రుద్రు ప్రభల శకటం వెళ్లడంతో జాతీయస్థాయిలో మరింత గుర్తింపు లభించింది. దీంతో కార్తీకమాసం సందర్భంగా ఏకాదశ రుద్రుల దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఏకాదశ రుద్రులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో కొలువై ఉన్నారు. అంబాజీపేట మండలంలో 9 గ్రామాలుండగా అయినవిల్లి, అమలాపురం మండలాల్లో నేదునూరు, పాలగుమ్మి గ్రామాలున్నాయి. కార్తీకమాసంతోపాటు ఇతర రోజుల్లో ఏకాదశ రుద్రులను ఒకేరోజు దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని పండితులు చెబుతారు. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి(సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి(తికాగ్నికాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి(శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి(కాలాగ్నిరుద్రుడు), వక్కలంక విశ్వేరస్వామి(త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వరస్వామి(నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మిచెన్నమల్లేశ్వరుడు(మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి(సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు)లను దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని చెబుతున్నారు.

కొవ్వూరు నుంచి ప్రత్యేక బస్సులు

ఏకాదశ రుద్రుల దర్శనం కోసం కొవ్వూరు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. గతేడాది కూడా కొవ్వూరు డిపో నుంచి 100 బస్సుల వరకు రావడంతో ఈ ఏడాది దర్శనాల కోసం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దర్శనాల కోసం సోషల్‌మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అల్పాహారం, విందు ఏర్పాటు చేసేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 18, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులను కొవ్వూరు డిపో నుంచి వస్తాయి.

ఒకే కాన్పులో ముగ్గురు...

జీజీహెచ్(కాకినాడ) నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు ఓ గర్భిణీ జన్మనిచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా, తణుకుకి చెందిన తపస్విని నిండు గర్భిణీ కావడంతో కుటుంబీకులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేయడంతో ఈనెల 6న జీజీహెచ్‌కు తరలించారు. ఈ నెల 8న మధ్యాహ్నం 1.34 నిమిషాల 34 సెకన్‌లకు మగ బిడ్డ, 1.34 నిమిషాల 48 సెకన్‌లకు ఆడబిడ్డ, 1.35 నిమిషాల 54 సెకన్‌లకు మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గైనిక్ విభాగాధిపతి డాక్టర్ అనురాగమయి సూచనలతో గైనిక్ వైద్యులు కాన్పు చేయగా పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు బృందం ముగ్గురు శిశువులను పూర్తి ఆరోగ్యవంతులుగా చేశారు. పిల్లలు పూర్తి ఆరోగ్యవంతులు కావడంతో తండ్రి తానేటి రాజు, తల్లి తపస్విని గైనిక్, పిడియాట్రిక్స్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు కవలలు

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

• జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ • డీసీవో, డీసీసీబీల్లో సహకార వారోత్సవాలు ప్రారంభం

కాకినాడ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషిచేయాలని కాకినాడ జిల్లా సహకార అధికారి(డీసీవో) జి.వెంకటకృష్ణ కోరారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా సహకార సదన్, డీసీవో కార్యాలయం, నాగమల్లితోట జంక్షన్‌లోని డీసీసీబీలోనూ డీసీవో సప్తవర్ణ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20 వరకు సహకార వారోత్సవాలు జరుగుతాయన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అంశంపై వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహకార వ్యవస్థ ఏర్పడి 120 ఏళ్లు పైబడినా అనుకున్నంత ఫలితాలు సాధించలేదన్నారు. డీసీసీబీ సీఈవో నరసింహారావు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రైతునేస్తం కింద రూ.545 కోట్లు రుణాలిచ్చామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 298 పీఏసీఎస్‌ల ద్వారా 6.50 లక్షల మంది సభ్యులకు మెరుగైన సేవలందిస్తున్నామని తెలిపారు. సహకార వారోత్సవాలు ప్రాముఖ్యతపై వారోత్సవాల ఇన్‌ఛార్జ్ ఆదిమాలం వెంకటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎమ్ సోము నాయుడు, డీసీసీబీ జీఎం పి.ప్రవీణ్‌కుమార్, డీఎల్‌సీవో దుర్గాప్రసాద్, డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సహకార వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

పారామెడికల్ కోర్సులకు 19న కౌన్సెలింగ్

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సుల్లో 2024-2025 విద్యా సంవత్సరానికిగాను లెఫ్ట్ ఓవర్ సీట్ల ప్రవేశానికి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఈనెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉభయ గోదావరి జిల్లాకి చెందిన దరఖాస్తుదారులు ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆర్ఎంసీ అధికారులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు https://rmckakinada.com వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.


దర్శనానంతరం దేవస్థానం అధికారులతో సుస్మిత

సత్యదేవుని సన్నిధిలో మెగాస్టార్ కుమార్తె

అన్నవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన రత్నగిరిపై గురువారం జరిగిన ఆత్మీయరాలి వివాహానికి మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుస్మిత హాజరయ్యారు. సత్యదేవుని ఆలయానికి వెళ్లిన ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు కొండలరావు, బలువు సత్యశ్రీనివాస్, గంటా విష్ణు, పోల్నాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న భద్రయ్య

అంతరిక్ష యాత్రకు అవకాశం కల్పించాలని వినతి

చింతూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష యాత్ర చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని దూబి భద్రయ్య కొంతకాలంగా పలువురు అధికారులను అభ్యర్థిస్తున్నాడు. గురువారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశాడు. మండలంలోని కొత్తపల్లికి చెందిన ఆదివాసీ యువకుడైన భద్రయ్య 2016 మే 20న ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాడు. అంతరిక్ష యాత్ర తన లక్ష్యమంటున్నాడు. ప్రభుత్వం తనకు అవకాశం కల్పించే దిశగా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ని కోరినట్టు భద్రయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు 17న క్రీడాకారుల ఎంపిక

సామర్లకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున పురుషులు, మహిళా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 17న కాకినాడ జిల్లా సామర్లకోట ఆయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు 85 కిలోల లోపు బరువు ఉన్నవారు, మహిళలు 75 కిలోల లోపు బరువు వున్న వారు హాజరుకావాలన్నారు. ట్రయల్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. వారు డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపాన గల సంతనూతలపాడులో జరిగే 71వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారన్నారు.


హార్బర్ ప్రాంతంలో టెట్రా ప్యాడ్స్‌ను ఢీకొని ముక్కలైన బోటు

బండరాళ్లను ఢీకొట్టి ముక్కలైన బోటు

కొత్తపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం ఉప్పొంగుతోంది. గురువారం ఉదయం కాకినాడ జిల్లా ఉప్పాడ-అమీనబాద్ మినీ హార్బర్ ప్రాంతం నుంచి బొందు సంజీవి బోటు వేటకు వెళ్లింది. ఒడ్డుకు చేరే క్రమంలో కెరటాల ఉధృతికి హార్బర్ మొగలో వేసిన టెట్రా ప్యాడ్స్ రాళ్లను ఢీకొని ముక్కలైంది. బోటులో ఉన్న సంజీవిని, మిగిలిన మత్స్యకారులను దగ్గర్లో ఉన్న మత్స్యకారులు రక్షించారు. బోటు ముక్కలవ్వడంతో దానిలో ఉన్న వలలు సముద్రంలో కొట్టుకుపోయాయని మత్స్యకార నాయకుడు సూరాడ రాజు చెప్పారు. సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందన్నారు.

వీరభద్రుడి సంబరంలో అపశృతి

పూనకంతో మహిళ మృతి

కరప, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపమండలం గురజనాపల్లి శివారు అడవిపూడిలో గురువారం వీరభద్రుడి సంబరంలో అపశృతి జరిగింది. వీరభద్రుడి సంబరానికి అదే గ్రామానికి చెందిన గెద్దాడ సత్యనారాయణ, అతని భార్య సత్యవతి వెళ్లారు. సంబరం జరుగుతుండగా సత్యవతిపై వీరభద్రుడు పూనడంతో ఆమె భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. ఆకస్మాత్తుగా కడుపులో మంట రావడంతో కుటుంబ సభ్యులు నీళ్లు పట్టించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు.



రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో జరిగిన బాలల దినోత్సవ సభలో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదివా

» పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధ్యం: పీడీజే గంధం సునీత » భవిష్యత్తుపై అవగాహన ఉండాలి: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకున్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే మంచి అవకాశాలు రావనేది ఒక అపోహ మాత్రమే' అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి బాలల దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను సాధించడం తెలుగు మీడియం, ఇంగ్లీషు మీడియం అనే విధానాలపై ఆధారపడి ఉండదన్నారు. లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలే విజయానికి చేరువ చేస్తుందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకోర్చి పిల్లలను బడికి పంపిస్తారని, వాళ్లు మంచి స్థానానికి చేరాలని ఉపాధ్యాయులు భావిస్తారని.. వారి పేరును నిలిపేలా పిల్లలు ఇష్టంతో కష్టబడి చదువుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడలకూ తగిన ప్రాధాన్యమిస్తే అపజయాలను తట్టుకుని విజయాల వైపు దూసుకుపోయే మానసిక ధైర్యం వస్తుందన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత అనేవి మంచి జీవితాన్ని సొంతం చేస్తాయన్నారు. పిల్లలతో సమయం గడపడం ఆనందంగా ఉందన్నారు. వారికి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


మాట్లాడుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు పట్ల పూర్తి అవగాహన ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యపడుతుందన్నారు. జీవితంలో నిరంతర సాధన చేసి వారు ఎంచుకున్న రంగాల్లో రాణించిన వాళ్లు మన కళ్ల ముందు ఎందరో ఉన్నారన్నారు. గడిచిపోయిన కాలం ఎన్నటికీ తిరిగిరాదనే సత్యాన్ని నెమరు వేసుకుంటూ ప్రస్తుత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు మంచి నడవడిక అలవర్చడంలో ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు ప్రధాన భూమిక పోషించాల్సి ఉంటుందని చెప్పారు. తొలుత దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిప్రకాశనంతో వేడుకలను ప్రారంభించారు. బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పిల్లల జాతీయ నేతల వేషధారణ, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, జేసీ చిన్నరాముడు, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, డీఎస్ఈవో కె.వాసుదేవరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి: పీడీజే

డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. గురువారం ఆమె పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. పెండింగులో ఉన్న ఆ విధమైన కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు.

మర్డర్ ఫర్ గెయిన్ కేసులో భార్యభర్తలకు జీవిత ఖైదు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మర్డర్ ఫర్ గెయిన్ కేసులో భార్యభర్తలకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అడిషనల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి గురువారం తీర్పునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం గ్రామానికి చెందిన తురుబిల్లి రోహిణి (31) ఆమె తల్లితో కలిసి క్వారీ కెనాల్ రోడ్డులో వారి ఇంట్లో ఉండేవారు. అనంతపురానికి చెందిన చెక్కా పవన్‌కుమార్ యాదవ్ అలియాస్ యాదవ్, అతని భార్య కళ్ళు లక్ష్మి అలియాస్ లక్కీ రోహిణి ఇంట్లో పోర్షన్‌లో అద్దెకు దిగారు. 2020 జూన్ 26న ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో రోహిణీని యాదవ్, లక్ష్మీ హత్యచేసి బంగారు గొలుసు లాక్కుని ఆమె తల్లిని గాయపరిచి పారిపోయారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు మర్డర్ ఫర్ గైన్ కేసుగా నమోదు చేశారు. ఈ కేసులో అప్పటి ఎస్పీ ఉత్తర్వుల మేరకు అప్పటి సీఐ ఎ.శ్రీను సమగ్ర దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో పీపీ పీవీవీఎస్‌బీ రాజు ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనాలు వినిపించారు. నేరం రుజువు కావడంతో దంపతులకు జీవిత ఖైదు, జరిమానా విధించారు.

కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

పుట్టినరోజు జరుపుకున్న రెండు రోజులకే...!

గొల్లప్రోలు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామల కట్నం వేధింపులు భరించలేక రైల్లోంచి దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చదలాడ గ్రామానికి చెందిన వరుపుల దివ్య (28)కి గొల్లప్రోలు పట్టణానికి చెందిన తొగరు రమేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచీ భర్త, అత్తమామలు అదనపు కట్నం కావాలని సూటిపోటి మాటలతో వేధించేవారని దివ్య పలుమార్లు తల్లిదండ్రులు, బంధువులకు చెప్పి బాధపడేది. బుధవారం సాయంత్రం పిఠాపురంలోని తల్లీపిల్లల ఆసుపత్రికి వచ్చిన ఆమె తాను పిఠాపురం రైల్వే స్టేషన్‌లో ఉన్నానని... భర్త, అత్తమామల వేధింపులు భరించలేక చనిపోతున్నానంటూ బంధువుల ఫోన్లకు మెసేజ్ పెట్టింది. దీంతో కుటుంబసభ్యులు వెతుకులాట ప్రారంభించారు. మల్లవరం, దుర్గాడ రైల్వేగేటు మధ్య దివ్య ట్రాక్ పక్కనే పడి ఉండడాన్ని గుర్తించారు. ఆమె రైలు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కట్నం వేధింపులతోనే ఆమె చనిపోయిందని తెలిపారు. కాగా ఈ నెల 11న కుటుంబసభ్యులతో కలిపి పుట్టినరోజు జరుపుకోవడంతో పాటు తాను ప్రెగ్నెంట్ అని చెప్పిందని, అదే సమయంలో అత్తింటివారు సూటిపోటి మాటలతో హింసిస్తున్నారని బాధపడినట్టు దివ్య సోదరుడు చెప్పాడు. ఇంతలోనే ఇలా జరుగుతుందని భావించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దివ్య (పాత చిత్రం)

బాలిక అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ

యువకుడి అరెస్టు... పోక్సో కేసు నమోదు

ప్రత్తిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మినర్వా జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం మిస్టరీ కేసు వీడింది. బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన యువకుడిని ప్రత్తిపాడు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం విలేకరులకు వివరించారు. ఎస్ఐ కథనం మేరకు.. కొడవలి గ్రామానికి చెందిన బాలిక అక్టోబరు 22న ప్రత్తిపాడు మినర్వా కాలేజీ నుంచి అదృశ్యమైనట్టు బాలిక తల్లి నూకరత్నం ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుమార్తె అదృశ్యంపై బాలిక తల్లిదండ్రులు ప్రత్తిపాడులో మీడియా సమావేశం నిర్వహించి ఎక్కడ ఉందో ఆచూకీ తెలపాలని కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్, డీఎస్పీ శ్రీహరిరాజు సూచనల మేరకు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో ఎస్ఐ లక్ష్మీకాంతం బాలిక అదృశ్యం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో దర్యాప్తు ముమ్మరంగా నిర్వహించి ఎట్టకేలకు బాలిక ఆచూకీ కనుగొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కొడవలి గ్రామానికి చెందిన బొద్దు ప్రకాష్ అనే జాన్‌ను ప్రత్తిపాడు శివారు పాదాలమ్మ గుడి వద్ద పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. బాలిక ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఈ కేసులో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. .

గమ్ అంటించాడని గుంజీలు తీయించారు

కాట్రేనికోన, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒక విద్యార్థి మరో విద్యార్థికి గమ్ అంటించాడన్న కోపంతో ఉపాధ్యాయుని ఆదేశంతో గుంజీలు తీసిన విద్యార్థి ఆసుపత్రి పాలయ్యాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పి.లక్ష్మివాడ హైస్కూల్లో చదువుతున్న మడికి రవితేజ మరో విద్యార్థికి గమ్ అంటించాడు. ఈ ఆరోపణతో 110 గుంజీలు తీయాలని రవితేజ ఉపాధ్యాయుడు ఆదేశించాడు. గుంజీలు తీసిన అనంతరం అతడు మోకాళ్ల వాపుతో కాట్రేనికోన పీహెచ్‌సీకి వచ్చాడు.


గౌరిదేవిపేటలో సాగు చేసిన మినుము పంట


గన్నవరంలో సాగు చేసిన లంక పొగాకు పంట

మిర్చి... నష్టాలు మూటగట్టి!

ఎటపాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మన్యంలో సిరులు పండించే మిర్చి పంటను ఈ ఏడాది రైతులు అంతంతగానే సాగు చేశారు. ఒకప్పుడు చిన్న, సన్నకారు రైతులకు సిరులు కురిపించే కల్పవృక్షంగా మారిన మిర్చి సాగును ఈసారి పంట మార్పిడి విధానంతో తగ్గించారు. గతంలో పది ఎకరాలు సాగు చేసిన రైతులు ఈసారి రెండు ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులైతే మిర్చి సాగు దరిదాపుల్లోకి పోలేదు. తమవల్ల కాదని చెప్తున్నారు. గత మూడేళ్లుగా వరుస నష్టాలు చవిచూసి కుదేలైన వారు ఈసారి మిర్చి సాగుకు ఆసక్తి కనబర్చలేదు. ప్రత్నామ్నాయంగా మినుము, లంక పొగాకు సాగువైపు అడుగులు వేస్తున్నారు. దీంతో ఏజెన్సీలో ఈసారి మినుము పంట సాగు విస్తీర్ణం పెరిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

మన్యంలో సిరులు కురిపించే మిర్చి పంటను రెండు దశాబ్దాలకు పైగా రైతులు విరామం లేకుండా సాగు చేస్తున్నారు. ఐదారేళ్ల క్రితం ఎటపాక మండలంలో ఐదారు వేల ఎకరాల్లో సాగు అయ్యేది. ఆ సమయలో దిగుబడి కూడా ఆశాజనకంగా వచ్చి లాభాలు అధికంగా చూసేవారు. దాంతో జగదల్‌పూర్, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి మిర్చి కొనుగోలు వ్యాపారస్తులు ఇక్కడకు వచ్చి.... ఈ ప్రాంత రైతులకు పంట సాగుకు ముందే పెట్టుబడులు ఇచ్చి వేళ్లేవారు. అలా పండిన పంటను రైతులు వారికి అమ్ముకునేవారు. కాగా ఐదారేళ్లుగా వ్యాపారస్తులు ఈ ప్రాంత రైతులకు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావట్లేదు. మిర్చి రైతులకు వరస నష్టాలు, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడమే కారణం. ఈ కారణంగా ఏజెన్సీ మండలాల్లో గత రెండేళ్లుగా మిర్చి సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. గతేడాది సుమారు 3,300 ఎకరాల్లో సాగు అవ్వగా ఈ ఏడాది కేవలం 1,800 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. రైతులు పంట సాగు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉండి గత నెల చివరి వరకు సాగు చేశారు.

> రెండు దశాబ్దాలుగా విరామం లేకుండా మిర్చి సాగు
> మూడేళ్లుగా వరస నష్టాలతో కుదేలు
> ఈసారీ అంతంతమాత్రమే.
> ప్రత్యామ్నాయంపై రైతుల చూపు
> ఏజెన్సీలో పెరిగిన వినుము,
> లంక పొగాకు సాగు

మన్యంలో మిర్చి రైతులు గత మూడేళ్లుగా వరుస నష్టాలను చూవిచూస్తున్నారు. కనీసం పెట్టుబడులు కూడా రాక నష్టాలు మూటగట్టుకున్నారు. మిర్చి పంటకు నల్లి తామర పురుగుతో పాటు వైరస్‌లు సోకడంతో ఆదిలోనే పంట నాశనమైంది. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టి అప్పులపాలయ్యారు. ఎకరా మిర్చి తోటలో బస్తా మిర్చిని కూడా సేకరించలేకపోయారు. 10 ఎకరాలు పైబడి సాగు చేసిన రైతులు నట్టేట మునిగారు. అప్పులిచ్చిన వారికి ఇంట్లోని బంగారం, బయట రూ.5 నుంచి రూ.10 వడ్డీకి తెచ్చి సగం అప్పులు తీర్చారు. ఈ ఏడాది పంట అమ్మిన తర్వాత తీర్చుతామంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు.

మిర్చి బదులు లంక పొగాకు

మండలపు సత్యనారాయణ, రైతు, గన్నవరం



గత ఏడాది పది ఎకరాల్లో రూ.11లక్షల పెట్టుబడితో మిర్చి పంట సాగు చేశాను. నల్లితామర పురుగు ఆశించడంతో పంట పూర్తిగా దెబ్బతింది. సుమారు 10 లక్షల వరకు నష్టపోయాను. ఈసారి మిర్చి బదులు పది ఎకరాల్లో లంక పొగాకు సాగు చేశాను. మిర్చిని పూర్తిగా వదిలేశాను. లంక పొగాకు కూడా ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

మిర్చితో రూ.3 లక్షలు నష్టపోయా

చిచ్చడి బాలరాజు, రైతు, కృష్ణవరం



గత ఏడాది రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. నల్లితామర పురుగు, వైరస్ ప్రభావంతో పంట దిగుబడి లేకుండా పోయింది. పెట్టుబడి పెట్టిన రూ.3లక్షలు నష్టం వాటిల్లింది. ఇక మిర్చి సాగు చేయకూడదని నిర్ణయించుకున్నా. ఈ ఏడాది రెండు ఎకరాల్లో లంక పొగాకు సాగు చేశాను. పంట ప్రస్తుతం బాగానే ఉంది. ప్రయివేట్ కంపెనీ వారు క్వింటాకు పదహారు వేలు ఇస్తామని చెప్పారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల ఆసక్తి

మిర్చి పంటకు వరస నష్టాలతో రైతులు ఏడాది ప్రత్యామ్నాయ పంటల సాగువైపు ఆసక్తి కనబరుస్తున్నారు. దాంతో విలీన మండలాల్లో ఈసారి మిర్చికి బదులు మినుము, లంక పొగాకు, జామాయిల్ పంటల సాగు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఎటపాక మండలంలో ఐదు వందల ఎకరాల్లో సాగైన మినుము, ఈఏడాది సుమారు వెయ్యి ఎకరాలకు పెరిగింది. లంక పొగాకు కూడా 300 ఎకరాల్లో సాగు చేశారు. అపరాల పంట నాలుగు వందల ఎకరాలకు పెరిగింది. కొందరు మిర్చి రైతులు కూరగాయలు పండిస్తున్నారు. జామాయిల్ సాగు ఈసారి సుమారు 900 ఎకరాల వరకు పెరిగింది. ప్రయివేట్ బ్రాండ్ మొక్క జొన్న సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. అయితే ఈ ఏడాది అంతంత మాత్రంగా మిర్చి పంట సాగు చేసిన రైతులు మిర్చిపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటివరకు బాగానే ఉందని చెప్తున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 14(ఆంధ్ర జ్యోతి): గొల్లప్రోలు మండలం వన్నెపూడిలోని దత్తాత్రేయస్వామి గుడి వద్ద గురువారం కార్తీకమాసం సందర్భంగా గొల్లపల్లి మాణిక్యాలరావు 100మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బవిరిశెట్టి రాంబాబు, గోపాలకృష్ణ, మొయిళ్ల వీరరాఘవరావు, గొల్లపల్లి పుత్రనాగేశ్వరరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో ప్రతిభకు వేదిక కౌశల్'

కాకినాడ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిఉన్న ప్రతిభకు వేదిక కౌశల్ అని జిల్లా సమన్వయకర్త కేసరిశ్రీనివాసరావు అన్నారు. కౌశల్ ప్రతిభా పోటీలకు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జగన్నాధపురంలోని బచ్చురామం మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ప్రసారం నిర్వహించారు. భారతీయ విజ్ఞాన మండలి, ఏపీసైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్-2024 పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కౌశల్ సహకరిస్తుందని 8.9.10 తరగతుల విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీవీఎస్ ఎన్‌మూర్తి ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొల్లప్రోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ పరిసర గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. గొల్లప్రోలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా పట్టణంతో పాటు తాటిపర్తి వాటర్‌వర్క్స్, బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాయవరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా ఉండదని చెప్పారు. చేబ్రోలు గ్రామంలో సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు


నడకుదురులో నమోదు చేస్తున్న నాయకులు

కరప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపడుతున్నట్టు మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావుల తెలిపారు. నడకుదురులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కన్వినర్ కటకంశెట్టి వెంకటప్రభాకర్ ఆధ్వర్యంలో శరవేగంగా పార్టీ సభ్యత్వాలు చేస్తున్నామన్నారు. నాయకులు కోన వెంకటలక్ష్మి, యడ్ల చిట్టిబాబు, చీపురుపలి రాము, డొక్కల వీరబాబు, అనివిరెడ్డి రామకృష్ణ, గొరెడ్డి వీరరాఘవులు తదితరులున్నారు.

టీడీపీ నేతల సంబరాలు

తాళ్లరేవు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రభుత్వ విప్‌గా నియామకమైన సందర్భంగా తాళ్లరేవు టీడీపీ నేతలు గురువారం సంబరాలు చేసుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన ఏర్పాటుచేసిన కేక్‌ను మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. దీరూబాయి అంబానీ ఎర్లీవెంటర్ సెంటర్‌లో దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు చెల్లి అశోక్, మోపూరి వెంకటేశ్వరరావు, పెసింగి ఈశ్వరరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, మందాల గంగసూర్యనారాయణ, అత్తిలి బాబూరావు, సూరంపూడి కుమార్, ముత్యాల జయలక్ష్మి, వడ్లమూరి సతీష్, జక్కల ప్రసాద్ పాల్గొన్నారు.

'చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం'


దేశ నేతల వేషధారణలో చిన్నారులు

పిఠాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌ఎస్‌కే దుర్గాదేవి తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిఠాపురం రథాలపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు స్వాతంత్ర్య సమర యోధులు, దేశ నేతల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి,దానం కమలారాణి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య చర్యలను మెరుగుపరచాలి

చొల్లంగి గురుకుల పాఠశాల, తాళ్లరేవు ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్


తాళ్లరేవు ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

తాళ్లరేవు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చొల్లంగి గురుకుల పాఠశాల, తాళ్లరేవు ఆసుపత్రిలో పారిశుధ్య చర్యలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆసుపత్రిలో వార్డుల్లో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించి పారిశుధ్యం సరిగా లేకపోవడంతో సూపరింటిండెంట్ డాక్టర్ స్నేహలతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక నెలరోజుల్లో మళ్లీ ఆసుపత్రికి వస్తానని, అప్పటిలోగా పారిశుధ్య చర్యలు మెరుగుపరచి రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని స్నేహలతను ఆదేశించారు. ఆసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణపనులను సకాలంలో పూర్తిచేసి బయటకు వెళ్లాలని కాంట్రాక్టరును ఆదేశించారు. డెలివరీలు ఇక్కడ చేయకుండా కేసులను కాకినాడ ఆసుపత్రికి తరలించేస్తున్నారని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. తక్షణం వైద్యులను నియమించే చర్యలు చేపడతానని, రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని తెలిపారు. చొల్లంగి గురుకులంలో పాఠశాల ఆవరణలో గోతులను పూడ్చాలని, డ్రైనేజీలు నిర్మించాలని, సిమెంటు రోడ్డు నిర్మాణం చేయాలని ప్రిన్సిపాల్ పద్మావతి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ స్వప్న, ఆసుపత్రి డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

21న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

పిఠాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఈనెల 21న నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యదర్శి కాకడ నూకరాజు, జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజా, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతపూడి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు గోడిచర్ల చినబాలరాజు కోరారు. పిఠాపురంలో గురువారం మహాసమ్మేళన పోస్టర్లు ఆవిష్కరించారు. మాదిగ సోదరులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకు లు పెదపాటి వెంకటరమణ, పెద్దాడ అప్పారావు, దేవరపు సురేష్, దొండపాటి అప్పారావు, దూలపల్లి వెంకటరమణ ఉన్నారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా మెంటారావు



కాకినాడ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాకినాడకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఏవీడీ మెంటారావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కాకినాడ జిల్లా టీడీపీ రజక సాధికారిత సమితి కన్వీనర్‌గా ఉన్నారు. తనకు పదవి లభించడం పట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబులకు మెంటారావు కృతజ్ఞతలు తెలిపారు.

తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెదకాపు



పెద్దాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, టీడీపీ నాయకుడు గెద్దం పెదకాపు నియమితులయ్యారు. తనను కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పలువురు కూటమి నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రవీంద్రకుమార్

కాకినాడ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన వల్లూరి రాజారవీంద్రకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా నియమించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలకు రవీంద్రకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

'కష్టించి పనిచేసిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు'

పిఠాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టించి పనిచేసే వారికి ఎల్లప్పుడు గుర్తిపు ఉంటుందని జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్ తెలిపారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పిఠాపురం మాజీ జడ్పీటీసీ సభ్యుడు బర్ల అప్పారావును పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలోని ఆయన గృహంలో విజయకుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం కలిసి సత్కరించారు.

చీడిగ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో శ్రీనివాస్

సర్పవరం జంక్షన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ చీడిగ గ్రామ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం పంచాయతీ రికార్డులు పరిశీలించారు. గ్రామ పరిపాలనకు చెందిన అంశాలపై గ్రామ కార్యదర్శి బొబ్బిలి గోవిందరాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పత్తి పంటపై పిండినల్లి ఉధృతి గుర్తించాం

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ


గొల్లప్రోలు మండలం దుర్గాడలో పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాస్త్రవేత్తలు, అధికారులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పత్తి పంటపై పిండినల్లి ఉధృతి అధికంగా ఉన్నట్టు గుర్తించామని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో పత్తి పంటపై తెగుళ్లు ఆశించడంతో దిగుబడి రాక, ధర లేక రైతులు పంటను తొలగిస్తున్న వైనంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శాస్త్రవేత్తతో పాటు వ్యవసాయాధికారులు గురువారం దుర్గాడ వచ్చి పత్తి పంటను పరిశీలించారు. పత్తి పొలాలు పక్కన బొప్పాయి, బెండ, జిల్లేడు, జామిడి మొక్కలు ఉన్న చోట పిండినల్లి ఉధృతి అధికంగా ఉన్నట్టు గుర్తించారు. ఇవిలేకుండా చూసుకోవాలని సూచించారు. నల్లి నివారణకు గానూ ప్రొఫినోఫాస్ 3మి.లీలు ఒక లీటరు నీటిలో కలిపి, లేదా ఎసిఫేట్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ ఉన్నారు.

మధుమేహం పట్ల అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్


అవగాహనా కార్యక్రమంలో డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చాప కింద నీరులా ప్రభావం చూపే మధుమేహం పట్ల అప్రమత్తత అవసరమని దాన్ని నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలపారు. ప్రపంచ డయాబెటీస్ డేను పురస్కరించుకుని గురువారం అడ్డంకులను బద్దలు కొట్టడం, అంతరాలను తగ్గించడం అనే నినాదంతో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ప్రతిరోజూ మధుమేహానికి సంబంధించి రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎవరికైనా మధుమేహం ఉంటే దగ్గరలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, మద్యపానం, ధూమపానం, వ్యాధుల తీవ్రతపై అవగాహనా కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఆర్.ప్రభాకర్, డాక్టర్ సురేఖ తదితరులున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేవి గ్రంథాలయాలు

జిల్లా ఉపవిద్యాశాఖాధికారి


సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కాకినాడ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సృజనాత్మకంగా, గుణాత్మకంగా తీర్చిదిద్ది వారిలో విజ్ఞాన తృష్ణను కలిగించేవి గ్రంథాలయాలని కాకినాడ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్‌లోని శాఖాగ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రారంభసభకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు అంగర గోపాలకృష్ణ(కృష్ణశ్రీ) మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల, గిడుగు, పాతూరి వంటి మహనీయుల గ్రంథాలయోద్యమాలు, త్యాగాల ఫలితమే గ్రంథాలయాల ఆవిర్భావమన్నారు. శాఖా గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ సేవలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. తొలుత సరస్వతీదేవి, జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించారు.

ప్రతీ ఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై ఎన్‌సీడీ సర్వే

డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత


సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సరిత

పెద్దాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఎన్‌సీడీ 3.0 సర్వేను ప్రారంభించినట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత తెలపారు. ప్రజల ఆరోగ్య స్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు ప్రభుత్వం నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) 3.0 పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారంచుట్టిందన్నారు. దీనిలో భాగంగా పెద్దాపురం డివిజన్ పరిధిలోని పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో గురువారం ఆరోగ్య సర్వే చేపట్టామన్నారు. క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, గుండె జబ్బులు, బీపీ, మధుమేహం తదితర వ్యాధిగ్రస్థుల గుర్తించేందుకు సర్వే దోహదపడుతుందన్నారు. తొలిసారిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల దాటిన మహిళలకు క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయో లేవో తెలుసుకునేందుకే ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు. నోటి, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్లను గుర్తించనునట్టు చెప్పారు. క్యాన్సర్‌తో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు కూడా ఇంటిదగ్గరే చేయనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి

కరప, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారిణి అన్నామణి సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు, డిజటల్ అసిస్టెంట్లు, గ్రామసంఘాల అధ్యక్షులు, యానిమేటర్లతో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)-2025-26 శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2030 నాటికి ప్రతీ గ్రామం సుస్థిరాభివృద్ధి సాధించాలన్న ప్రభుత్వ సంకల్పం మేరకు ప్రజల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను తయారుచేయాలన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని జడ్‌పీ సీఈవో వీవీఎస్.లక్ష్మణరావు సందర్శించి పలు సూచనలు చేశారు. జీపీడీపీ నివేదిక రూపొందించడంలో అనుసరించాల్సిన విధి విధానాలను ఈవోపీఆర్డీ సలాది వెంకటశ్రీనివాసరావు, పెనుగుదురు కార్యదర్శి బి.చంద్రకళలు వివరించారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గండ్రేటి శైలజ, వీవీవీఎస్ వర్ధన్, మండల పశువైద్యాధికారి ఎం.రవికిరణ్, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్ పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు చిరస్మరణీయం

పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి


కాకినాడలో కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లిపూడి

కాకినాడ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తొలి ప్రధాని నెహ్రూ సేవలు చిరస్మరణీయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీను, డీసీసీ ఉపాధ్యక్షుడు పబ్బినీడి కృష్ణ, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బండారు జయప్రకాష్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, సిటీ ఉపాధ్యక్షుడు దవులూరి ధనకోటి పాల్గొన్నారు.

చెత్తలో నెహ్రూ విగ్రహం

సామర్లకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలిప్రధాని నెహ్రూ జయంతిని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తుండగా సామర్లకోట మున్సిపల్ అధికారులు ఆ దేశనాయకుని విగ్రహానికి తీవ్ర అవమానం చేశారు. గతంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉండే నెహ్రూ విగ్రహాన్ని తదనంతరం కార్యాలయ అభివృద్ధి పనులతో తొలగించి మున్సిపల్ కార్యాలయం ఎదరుగా గల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మెట్ల కింద చెత్తలో వదిలేశారు. గురువారం సదరు నెహ్రూ విగ్రహాన్ని శుభ్రం చేసి కనీసం పూలమాల వేయకపోవడం అత్యంత విచారకరం అని పలువురు సీనియర్ సిటీజన్లు వాపోతున్నారు.


సామర్లకోటలో చెత్తలో ఉన్న నెహ్రూ విగ్రహం

జాతీయ సహకార వారోత్సవాలు


కరప: జడ్.బావారం సొసైటీ వద్ద ఆవిష్కరించిన సహకార జెండా

కరప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా సొసైటీ కార్యాలయాల వద్ద గురువారం 71వ జాతీయ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కరప, జడ్.బావారం, పెనుగుదురు, పెద్దాపురప్పాడు, వేములవాడ, కూరాడ, యండమూరు సొసైటీల వద్ద సహకార జెండాలను ఎగురవేసి జెండాలోని ఏడు రంగుల విశిష్టతను రైతులకు వివరించారు. ఆయా సొసైటీల సీఈవోలు పి.నాగేశ్వరరావు, రాయుడు వెంకటేశ్వరరావు, నల్లా వెంకటేశ్వరరావు, బి.పరశురామ్, నక్కా మూర్తి, పి.శ్రీనివాస్, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: సమష్టి కృషితోనే సహకార సంఘాలు బలోపేతం అవుతాయని కట్టమూరు పీఏసీఎస్ సీఈవో శానపల్లి నాగభూషణం అన్నారు. సహకార వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో కట్టమూరు పీఏసీఎస్‌లో ఆయన పతాకావిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు. పీఏసీఎస్‌ల బలోపేతానికి డీసీసీబీ, ఆప్కాబ్‌లు ఎంతగానో సహకరిస్తున్నాయని, సిబ్బంది కూడా అంకితభావంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది ఆర్.హిమశేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్(కాకినాడ): ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ(కేసీబీఎస్)లో సహకార వారోత్సవాలను ప్రారంభించారు. కేసీబీఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. మేనేజర్ చీమలకొండ గంగాధరం సహకార వ్యవస్థ ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, కోసూరి లక్ష్మీప్రసాదలావణ్య, ఓబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాలయోగి, కేసీబీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు..

వేణుగోపాలస్వామి రథోత్సవం

పిఠాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవం గురువారం రాత్రి కనులపండువగా జరిగింది. ఆలయం నుంచి ప్రారంభమయిన రథోత్సవం పురవీధులు గుండా ఉప్పాడ సెంటర్‌కు చేరింది. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఈవో నున్న శ్రీరాములు, ఆలయ అర్చకుడు పి.వి జయజనార్ధనాచార్యులు పాల్గొన్నారు.

'అపార్ ఐడీ జనరేషన్‌పై ఒత్తిడి తగదు'

సర్పవరం జంక్షన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆధార్ ఐడీతో అనుసంధాన ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేయాలంటూ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఓ ప్రకనటలో యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఎఫ్) ఛైర్మన్ డి.దుర్గాశ్రీనివాసరావు తెలిపారు. అపార్ ఐడీ అనుసంధాన ప్రక్రియలో తప్పులు లేకుండా వ్యక్తిగతంగా విద్యార్థుల సమాచారాన్ని క్రోడీకరిస్తూ ప్రతీ పౌరుడు చేయాల్సిన పనిని స్కూల్స్‌కి అప్పగించడం ప్రభుత్వ విధానపరమైన తప్పిదమన్నారు. ఈ ప్రక్రియ సవరణకు అవకాశం లేని అపార్ సమాచారం తప్పుల తడకగా చేయడం వల్ల కలిగే నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేస్తారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. అపార్ జనరేషన్ మాండేటరీ కాదని కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్నా అధికారులు ఒత్తిడి చేయడం తగదన్నారు. గత 20 రోజులుగా అపార్ జనరేషన్ ప్రక్రియలో ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యా విషయాలపై శ్రద్ధ మాని ఈపనిమీదే ఉండటంతో విద్యాబోధన కుంటుపడుతుందన్నారు.

'ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి'

పెద్దాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గృహాలు మంజూరైన లబ్ధిదారులు 2025 మార్చి 31 తేదీనాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక సూరంపాలెం లేఅవుట్‌లో లబ్ధిదారులతో గురువారం ఆయన అవగాహనా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం అన్ని రకాల సహాయసహకారాలను అందించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, హౌసింగ్ ఈఈ కేవీఆర్ గుప్త, డీఈఈ సువర్ణరాజు, ఏఈ శ్రీను, వర్క్ ఇనస్పెక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు

'శ్రీప్రకాష్'లో బాలల దినోత్సవం

పెద్దాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి ప్రవీణ్ మాట్లాడారు. ప్రొఫెసర్ సంతానం, పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లా డారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఆకడమిక్ కల్చరల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో చిరంజీవి కుమార్తె పూజలు


చేబ్రోలులోని పవన్ నివాసం వద్ద సుస్మితకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పిఠాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలయాలను ప్రముఖ సినీ నటుడు చిరంజీవి కుమార్తె సుస్మిత సందర్శించారు. పట్టణంలోని పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవిలను దర్శించుకున్నారు. పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఔదంబర వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సుస్మితను ఈవో సౌజన్య ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసానికి వెళ్లగా జనసేన నాయకులు స్వాగతం పలికారు.

భీమేశ్వరాలయంలో...

సామర్లకోట: సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో చిరంజీవి కుమార్తె సుస్మిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుస్మితకు ఆలయ అధికారులు, పండితులు చెరుకూరి రాంబాబు తదితరులతో సాదరంగా స్వాగతం పలికారు. కాలభైరవస్వామితో సహా అన్ని ఉపాలయాలలో దేవతామూర్తులను సందర్శించారు. భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు.

మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, కాకినాడ
I A NO 148/2023 in O S 982/2019
Between
గంగాబత్తుల వెంకట భూషణ్‌రావు ... పిటీషనరు/వాది
మరియు
నందూరి మణి అనే మాణిక్యాలరావు వగైరాలు ... రెస్పాండెంట్లు / ప్రతివాదులు
3వ రెస్పాండెంటు/ Proposed ప్రతివాది: నందూరి మహాలక్ష్మి, D/o. నందూరి మణి అనే మాణిక్యాల రావు R/o డోర్‌నెం. 33-3-4, పుల్లంకల వారి వీధి, పెద మార్కెట్, కాకినాడ.
4వ రెస్పాండెంటు / Proposed ప్రతివాది: నందూరి శేఖర్, S/o. నందూరి మణి అనే మాణిక్యాలరావు R/o డోర్‌నెం. 33-3-4, పుల్లంకల వారి వీధి, పెద మార్కెట్, కాకినాడ.
ఈ దావాలో 2వ ప్రతివాది అయిన నందూరి మణి అనే మాణిక్యాలరావు గారి భార్య నందూరి సత్యవేణి గారు చనిపోయినందున వారికి వారసులుగా 3వ, 4వ వార్లను చేర్పు నిమిత్తం మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేస్తుండుటవలన మీ హాజరు నిమిత్తం ది. 20-11-2024 తేదీన ఉదయం గం 10-30 ని.లకు శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కాకినాడ 14-11-2024 — కూన వెంకట్రావు, అడ్వకేట్, పెండూరు, కాకినాడ జిల్లా, సెల్: 9553341177

'స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలిపివేయాలి'

తుని రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారుతున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తునిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గొర్ల వెంకటరమణ, బత్తిన నాగేశ్వరరావు, సాత్విక దేవి, ఆనంద్, దేవి పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రాజవొమ్మంగిలోని అంగన్వాడీ కేంద్రంలో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

ఘనంగా బాలల దినోత్సవం

రాజవొమ్మంగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి టీచర్లు, విద్యార్థులు నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వినూత్న వేషధారణలతో ఆకట్టుకున్నారు.

దేవీపట్నం: నేటి బాలలే రేపటి పౌరులని ఐక్యరాజ్యసమితి ప్రకటించిన బాలల హక్కులను కాపాడదామని మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వలంటీర్ కారం రామన్నదొర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేవీపట్నంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. వలంటీర్ యలగాడ నాగేశ్వరరావు బాలల హక్కులను వివరించారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వై.రామవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి జర్తా సత్యవతి విద్యార్థులకు గ్రంథాలయ ఉపయోగాలను వివరించారు. పనసలపాలెం, బండిగడ్డ, దాలిపాడు ఆశ్రమ పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా జరిపి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

మోతుగూడెం: మోతుగూడెం డీఏవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఈ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్న పిల్లల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



వై.రామవరంలో...



మోతుగూడెంలో....



విద్యార్థులను అభినందిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

విద్యార్థులకు క్రీడా ప్రోత్సాహం

రంపచోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సాహానికి చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఈ నెల 8 నుంచి పదో తేదీ వరకు ఢిల్లీ, మహారాష్ట్రల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన బందపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కె.సర్విన్‌బాబుదొర, కె.లోకేష్‌దొర, కె.కళ్యాణరావు, సీహెచ్ వరుణ్‌తేజ, కె.దినేష్‌కుమార్ గురువారం ఐటీడీఏ పీవోను కలిశారు. వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీరాములు, పీడీ కె.తిరుపతిరావు, ఎం.కరుణవిలస్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

రంపచోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికలపై గురువారం వైటీసీ కార్యాలయంలో ఎంపీడీవో సుందం శ్రీనివాసుదొర ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల, గ్రామ సమాఖ్య వీవో లీడర్లు, సెక్రటరీలకు అవగాహన కల్పించారు. సీడీపీవో సంధ్యారాణి, జేఈలు పి.వెంకటరమణ, సురేష్, వెటర్నరీ డాక్టర్ రిక్కీరాయ్, ఏవో లక్ష్మిరావు, డీఎల్డీవో కోటేశ్వరరావు, ఏపీఐవో చంద్రకళ, ఏటీఎం జీఆర్‌కే స్వామి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన ఏటీడబ్ల్యువో

దేవీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామనపల్లి, పోతవరం, శరభవరం గిరిజన ఆశ్రమ పాఠశాలలను గురువారం ఏటీడబ్ల్యుఓ రామతులసి సందర్శించారు. పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి స్టోర్ రూమ్, వంటశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు బి.చంద్రకళ, సీహెచ్ నూకాలమ్మ, వీరపుదొర, డిప్యూటీ వార్డెన్లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



నెహ్రూ జయంతి

అడ్డతీగల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ సెంటర్లో తొలి ప్రధాని నెహ్రూ జయంతిని కాంగ్రెస్ నాయకుడు దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ పాఠశాల సిబ్బంది, నాయకులు కొండబాబు, కృష్ణ, ఎస్.రమణ, బాలలు పాల్గొన్నారు.

నూతన కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానాలు

జగ్గంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబును ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన సందర్భంగా జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి కొండబాబును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కొట్టేటి సత్తిబాబు పాల్గొన్నారు.

తుని రూరల్: గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామితులైన తునికి చెందిన టీడీపీ నేత మళ్ల గణేష్‌ను కూటమి నాయకులు సత్కరించారు. తుని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి గణేష్‌ను శాలువాతో సత్కరించారు. టీడీపీ నాయకులు మోతుకూరి వెంకటేష్, యినిగంటి సత్యనారాయణ, కుక్కడపు బాలాజీ, దంతులూరి శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

రౌతులపూడి: కొప్పుల వెలమ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావును టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ కోరారు. సాంబశివరావుకు దుశ్శాలువా కప్పి సన్మానించారు. పంచాడ బుజ్జీ, కోరుప్రోలు బుజ్జిబాబు నాయుడు, లెక్కల రాము, జేట్లా రాజా, తండపు రెడ్డి అప్పారావు, చింతకాయల రాజు, పైల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నారాయణస్వామి

ఏలేశ్వరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఏలేశ్వరం పట్టణానికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నారాయణస్వామి టీడీపీ పట్టణాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'ఆదిత్య'లో చండీ యాగం

గండేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సహస్ర చండీ యాగం మూడోరోజు గురువారం కొనసాగింది. చతుర్వేద పారాయణం, పురస్సర, రుద్రాభిషేకం, చండీ హోమం, చండీ పారాయణ, నీరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను 100 మంది వేదపండితులు నిర్వహించారు. ఆదిత్య కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఉన్నారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఘనంగా బాలల దినోత్సవం



కిర్లంపూడి: ముక్కొల్లులో విద్యార్థుల ప్రదర్శన

కిర్లంపూడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కొల్లు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కె.రామసత్యనారాయణ, విద్యాకమిటీ ఛైర్మన్ కొండపల్లి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ జ్యోతుల రాంబాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులు వేషధారణలతో లఘునాటికలు ప్రదర్శించారు.

తుని రూరల్: బాలల దినోత్సవాన్ని తుని గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించారు. భారత వికాష్ పరిషత్ తుని శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం పలు విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించి వికాస పరిషత్ తుని గౌరవాధ్యక్షుడు మంతెన సూర్యనారాయణ రాజు బహుమతులు అందజేశారు. డీవై బాబు, ఆసిన సత్యనారాయణ, చదరం శివాజీ,శంకర్, గాజుల గోపాల స్వామి, ఆంజనేయప్రసాద్ తదితరులు ఉన్నారు.

తొండంగి: మండలంలోని అన్ని పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నెహ్రూ సేవలను కొనియాడారు. విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రత్తిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలోని గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయాధికారి బి.సన్యాసి ప్రారంభించారు. పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు, కవి సమ్మేళనాలు, గ్రంథాలయ ఉద్యమ అవశ్యకత, పుస్తక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దాడి వీరబాబు, జె.సూర్య, పిల్లి లోవకుమారి తదితరులు ఉన్నారు.

జగ్గంపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జగ్గంపేటలోని గ్రంథాలయంలో నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి హాజరై జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయభాస్కరరావు, సలాది సత్యనారాయణ, కొల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: తుని గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు ప్రారంభించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జి.రంగనాధరావు, ఐ.పతాంజలితో పాటుగా గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ నమోదు వేగవంతానికి చర్యలు

డీఈవో రమేష్

కోటనందూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యార్థుల అపార్ ఐడీ నమోదు వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని డీఈవో రమేష్ తెలిపారు. గురువారం కోటనందూరు ఎంఈవో కార్యాలయాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కొన్ని ఇబ్బందులున్నా త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలో 5827మంది విద్యార్థులుండగా ఇంతవరకు 4380 మందికి ఐడీ చేశారని, మిగిలినవి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో2 రామశేఖర్, సీఆర్పీ యర్ర శేఖర్, సంపెంగి మన్నేశ్ ఉన్నారు.



కోటనందూరులో ఎంఈవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న డీఈవో

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

జగ్గంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడం చట్ట వ్యతిరేకమని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రాజపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల భద్రత, రక్షణపై గురువారం జగ్గంపేట సీఐ ఆధ్వర్యంలో ఉమెన్ పోలీస్, మహిళారక్షక్ బృందాలతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్‌లో ఫేక్ అకౌంట్ల ద్వారా వచ్చే సందేశాలు, లింకులకు ఏ ఒక్కరు స్పందించకుండా అప్రమత్తగా వ్యవహరించాలన్నారు. యువత సెల్‌ఫోన్ల ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌ల జోలికి వెళ్ళరాదని సూచించారు. విద్యార్థులకు ఏ విధమైన సహకారం కావాలన్నా 100 లేదా జగ్గంపేట సీఐ 94407 96529, ఎస్ఐ 94407 96569కు ఫోన్ చేసి మహిళా రక్షక్ సహకారం, సేవలు పొందవచ్చని తెలిపారు. గ్రామపెద్దలు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

తప్పిన పెద్ద ప్రమాదం

తొండంగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రహదారిపై వెళ్తున్న కారు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటనలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. గురువారం అన్నవరం వైపు నుంచి ఒంటిమామిడి వైపు వెళ్తున్న కారు తొండంగి ఒంటిమామిడికి మధ్య విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా అది పూర్తిగా విరిగి విద్యుత్ వైరుపై ఆధారపడి ఉంది. కారు పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకు వెళ్లి అక్కడ ఉన్న కొబ్బరి చెట్టుకు ఆనుకుని ఉండిపోయింది. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా ఎవరికి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. దీనిపైపోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

గండేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో సుబ్బయమ్మపేట గ్రామంలో గురువారం వినాయక, అయ్యప్పస్వామి, కుమారస్వామి నూతన విగ్రహాల ప్రతిష్ఠ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు హాజరయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్య దొర, మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, జాన్తి వసంత్, మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, పార్థ సారధి, మేడిబోయిన శ్రీను, ఎస్.రామ్‌దీప్, మాధవరపు వీరబాబు,సూరపరెడ్డి నరేష్ పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

ప్రత్తిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం పార్టీ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పెరిగిన నిత్యావసర ధరల కారణంగా సామాన్య, మధ్యతరగతి వారు ఇబ్బందులు పడుతున్నారని డిమాండతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సూర్యప్రభకు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, సతీష్‌కుమార్, రమణ, సీ.సత్య, పి.దొంగలు, వరలక్ష్మి పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

యూటీఎఫ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



అడ్డతీగల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల అధికారి విల్సన్‌బాబు, ఎన్నికల పర్యవేక్షకుడు జి.తేజారావు వెల్లడించారు. ఎమ్మార్సీ భవనంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘ జిల్లా ఆడిటర్ పి.మంగరాజు, జిల్లా పత్రికా కార్యదర్శి ఆంద్రేయులు విచ్చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.కుసలన్న, అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, సహ అధ్యక్షుడిగా జగదీష్, మహిళా అధ్యక్షురాలిగా రమణమ్మ, ప్రధాన కార్యదర్శిగా కేవీ రాఘవులు, కోశాధికారిగా దొరబాబు, కార్యదర్శిగా చిన్నారావు, పత్రికా కార్యదర్శిగా నాగన్నదొర, మహిళా కార్యదర్శిగా లక్ష్మీప్రభ, కార్యదర్శులుగా జి.పోలయ్య, పి.రాజారెడ్డి, కె.అబ్బాయిరెడ్డి, పి.అప్పారావు, ఎం.సత్యఅపర్ణ, సతీష్‌రెడ్డి, అప్పారావు ఎన్నికయారు. జిల్లా కౌన్సిలర్లుగా కె.శ్రీనివాస్, కేవీ రాఘవులు, జి.తేజారావు, పి.మంగరాజు, బి.దొరబాబు, పి.కమలరత్నం, జి.రాంబాబు, సీహెచ్ చిన్నిబాబుదొర ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు చెప్పారు.

చింతూరులో బాలల దినోత్సవం

చింతూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో క్రీడలు, వ్యాసరచనతో పాటు పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కస్తూర్బా పాఠశాలలో జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉజ్వల భవిష్యత్ కోసం అనుసరించాల్సిన విధానాలపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. జనకళ్యాణ్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావు, కో-ఆర్డినేటర్ గణేష్ సీడీపీవో పి.విజయగౌరి, కస్తూర్బా బాలికల పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఐసీడీఎస్ పర్యవేక్షణాధికారిణి సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ముసురుమిల్లికి 'ఆశా వర్కర్' నియమించాలి



రంపచోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసురుమిల్లి ఆశా వర్కర్ కె.అనుష ఐదు సంవత్సరాలుగా విధులు సరిగా నిర్వర్తించట్లేదు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకువెళ్లడంలో అలసత్వం వహిస్తోంది. ఆమెను తొలగించి నూతన వర్కర్‌ను నియమించాలని కోరుతూ ఆ గ్రామస్తులు గురువారం పెదగెద్దాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వలల సరస్వతి, కామారపు వెంకటరెడ్డి, జి.బాలురెడ్డి, ఎస్.సునీత, ఎన్.నాగమణి, ఎం.అనంతకుమారి, పి.ఏడుకొండలురెడ్డి పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు

మోతుగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని ఒడియా క్యాంపు గ్రామంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి ప్రజ్ఞ రోగులను పరీక్షించారు. ప్రస్తుత సీజన్లో ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒడియా క్యాంపు గ్రామంలో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఇటీవల శిశు మరణాలు అధికంగా సంభవిస్తున్న నేపథ్యంలో 0-1 ఏళ్ల చిన్నారులకు శిశు స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సరైన బ్రెస్ట్ ఫీడింగ్ పద్ధతులు, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం మంగమ్మ, ఆసుపత్రి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.